
సాక్షి తిరుపతి

మంగళవారం ౹ 11 ౹ జూన్ ౹ 2024



అరణియార్ ఎదురు‘చేపలు’
అరణియార్ జలాశయంలో చేప పిల్లను వదలాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు. - 8లో



విద్యార్థులకు బస్సు పాసులు సిద్ధం
విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వెళ్లేందుకు బస్సు పాసులను ఈ నెల 12 నుంచి అందించనున్నారు. - 8లో



శ్రీవారి దర్శనానికి 10 గంటలు
తిరుమల శ్రీవారి దర్శనానికి ముందస్తు టికెట్లు లేకుంటే సుమారు 10 గంటల సమయం పడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

టీటీడీ పీఆర్‌ఓగా నీలిమ



తిరుపతి(అలిపిరి): టీటీడీ పీఆర్‌ఓగా నీలిమ సోమవారం టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీఆర్‌ఓగా పనిచేస్తున్న టి.రవికి నాలుగు నెలల క్రితం సీపీఆర్‌ఓగా ఉద్యోగోన్నతి లభించడంతో ఆ స్థానంలో నీలిమ పీఆర్‌ఓగా బాధ్యతలు చేపట్టారు. నూతన పీఆర్‌ఓకు పలువురు జర్నలిస్టులు, ఉద్యోగులు , కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాబు ప్రమాణస్వీకారానికి బస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఈ నెల 12వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఒక్కో నియోజకవర్గం నుంచి నాలుగు బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాణస్వీకారాత్సోవాన్ని ప్రత్యక్షంగా చూడాలనుకునే వారి కోసం కావాల్సిన ఏర్పాట్లను తహసీల్దార్లు, ఎంపీడీఓలు చేపట్టాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ప్రజలను తరలించేందుకు ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారి నియమిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మండల కేంద్రాల్లో ప్రమాణస్వీకారం చూడడానికి అవసరమైన టీవీలను సైతం ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అలంకరించి పండుగ వాతావరణం తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, మెప్మా పీడీ రాధమ్మ, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి, డీఎల్‌డీఓ సుశీలాదేవి, డీటీ ఆశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

తిరుపతి అర్బన్ : జిల్లావ్యాప్తంగా సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సుమారు 149.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాకాల మండలంలో 15.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా తిరుపతి రూరల్‌లో 1.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు.కొద్దిరోజులుగా రోజూ చిన్నపాటి వర్షం కురుస్తుండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. వాతావరణం సైతం చల్లబడడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



కరింబాయి చెంచయ్య

నాయుడుపేట టౌన్ : మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కరింబాయి చెంచయ్య సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఈ మెయిల్ ద్వారా ఆ శాఖ చీఫ్ సెక్రటరీకి పంపించారు. వైఎస్సార్‌సీపీ ఓడిపోయిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేసినట్లు చెంచయ్య తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ఆపద్ధర్మ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్కు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పద్మ అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఏటా గణతంత్ర దినోత్సవం రోజున పద్మ అవార్డులు అందజేస్తుందన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారు ఈ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజావ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమ మొదలైన రంగాలకు చెందిన వారు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు మొదటగా www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత దరఖాస్తు నమూనాను తిరుపతి జిల్లా కేంద్రంలోని అలిపిరి రోడ్డులో ఉన్న సెట్విన్ కార్యాలయంలో జూలై 22వ తేదీ లోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9440573537 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, తిరుపతి నగరాల్లో వీధికో ప్రైవేట్ స్కూల్ పుట్టుకొస్తోంది. ప్రతి ఏటా ఆ పాఠశాలల సంఖ్య పెరుగుతూనే ఉంది. తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం, పుంగనూరులలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఆయా బ్రాంచులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. హంగులు, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు వివిధ రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎల్లుండి నుంచి పాఠశాలలన్నీ పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.



గుర్తించకపోతే మోసపోతారు

- ప్రైవేట్ స్కూల్స్‌పై ఆరా తీయండి
- అన్నీ పరిశీలించాకే పిల్లలను చేర్పించాలి
- హంగులు, ఆర్భాటాలు చూసి వెళ్లొద్దు
- అనుమతులు, గుర్తింపులపై అడిగి తెలుసుకోవాలి
- ఈ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు ఈ నెల 13న పునఃప్రారంభం కానున్నాయి. మేడిపండు చూడ మేలిమైనుండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు అన్న చందాన ఆకర్షణీయ ప్రకటనలు, ఆకట్టుకునే ఆఫర్లు చూపించే ప్రైవేట్, కార్పొరేట్ మోసాలకు లోనుకాకూడదని పలువురు విద్యావేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు సదరు పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పొందిందా? లేనిదీ గమనించాలని, ఆ తరువాత పాఠశాలలో ఉన్న సదుపాయాలు, బోధన సిబ్బంది తదితరాలు పరిశీలించిన తరువాతనే ముందుకు వెళ్లాలని హితవు పలుకుతున్నారు.

గుర్తింపు పొందిన స్కూల్స్ 1,177

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు 1,177 ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో సీబీఎస్‌ఈ, స్టేట్ సిలబస్ ఉన్న ప్రాథమిక పాఠశాలు 459, ప్రాథమికోన్నత పాఠశాలలు 251, ఉన్నత పాఠశాలలు 702 ఉన్నాయి. ఇందులో దాదాపు 2,54,421 మంది విద్యార్థులు అన్ని తరగతుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఏటా అధికారులు గుర్తింపు లేని పాఠశాలలు ఏమీ లేవని చెబుతుంటారు. అయితే పలు చోట్ల విద్యాశాఖ అధికారులను కార్పొరేట్ విద్యాసంస్థలు మోసం చేసి గుర్తింపు లేని శాఖలను నిర్వహిస్తున్నారు. వీటిపై తల్లిదండ్రులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రైవేట్ బడుల సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	459
ప్రాథమికోన్నత పాఠశాలలు	251
ఉన్నత పాఠశాలలు	467
విద్యనభ్యసిస్తున్న బాలురు	1,41,114
విద్యనభ్యసిస్తున్న బాలికలు	1,13,307

అనుమతుల్లేని బడుల్లో చేర్పొద్దు

రాష్ట్ర ప్రభుత్వం అనుమతిలేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని స్కూల్స్‌లో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట విద్యార్థులుగానే పేర్కొంటారు. కొత్త ప్రైవేట్ పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరిచి విద్యార్థులను చేర్చుకోవాలి. ప్రాథమిక స్థాయి పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత పాఠశాలకు విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

తెలుసుకోవాల్సిన అంశాలు

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. గుర్తింపు పొందిన విద్యాసంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రైవేట్ విద్యార్థిగానే ప్రభుత్వం పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరం.

తల్లిదండ్రులు పాటించాల్సిన జాగ్రత్తలు

- ప్రైవేట్ విద్యాసంస్థల్లో పిల్లలను చేర్చాలనుకునే తల్లిదండ్రులు ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి మోసపోకూడదు.
- చేర్పించే పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా? అనేది తొలుత చూసుకోవాలి. పాఠశాల భవనం నాణ్యతపై ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- జి–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- బాత్ రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా చూసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- విద్యార్థుల మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అన్ని సబ్జెక్టులకు అర్హత గల ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారా లేదా అన్న విషయం పరిశీలించాలి.

అనుమతులు లేకుంటే పాఠశాలలు సీజ్



“ప్రైవేట్, కార్పొరేట్ బడులకు తప్పనిసరిగా అనుమతులు ఉండాల్సిందే. పాఠశాలలు పున:ప్రారంభం నాటికి అనుమతులు లేకుంటే ఖచ్చితంగా సంబంధిత పాఠశాలలను సీజ్ చేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించే ముందు తప్పనిసరిగా అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ బడుల ఎదుట నోటీస్ బోర్డులో తప్పనిసరిగా సంబంధిత పాఠశాల వివరాలు నమోదు చేయాలి. పాఠశాల బోర్డుపై అనుమతి పొందిన నెంబర్ తప్పనిసరిగా ఉండాల్సిందే. లేకుంటే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం. – దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో నూకతోటి రాజేష్ తదితరులు

వరదయ్యపాళెం: రాజకీయాల్లో జయాపజయాలు సహజమని, ఎవరూ అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం తిరుపతిలో పెద్దిరెడ్డిని ఆయన స్వగృహంలో నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలసి పిచ్చాటూరుకు చెందిన మండల మాజీ కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి, మరికొందరు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పిచ్చాటూరు మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి స్వల్ప ఆధిక్యత తీసుకువచ్చామని, అయితే కొన్నిచోట్ల అనుకున్న మెజారిటీ రాని కారణంగా రాజేష్ ఓటమి చవిచూడాల్సి వచ్చిందని వివరించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల తీర్పును శిరసా వహించాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకులు సంయమనం పాటించి పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు, పార్టీ శ్రేణులకు నేను, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రణాళికాబద్ధంగా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుదామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్మిక విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సీనియర్ నాయకుడు భానుప్రకాష్ రెడ్డి, పిచ్చాటూరు సర్పంచ్ రోశయ్య, వరదయ్యపాళెం మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధుల నిర్వహణ

- మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



పూర్ణకుంభం సర్కిల్ సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తిరుపతి మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరంలో అమలు చేస్తున్న మహిళ రక్షక్, ట్రోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. సైబర్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో కట్టుదిట్టంగా నిఘా పెట్టాలని తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును గుర్తించి వారికి రివార్డులు ఇవ్వాలని చెప్పారు. గత ఏడాది నుంచి ఎవరైనా అసాధారణ మంచి పని చేసి ఉంటే తగిన ప్రోత్సాహాలు అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో చాలా మర్యాదగా మాట్లాడాలని స్పష్టం చేశారు. మహిళల సమస్యలు చాలా భిన్నంగా ఉంటాయని, మీరు శిక్షణ పొంది వచ్చారు కనుక సమస్యలు పరిష్కరించే దిశగా వారితో మాట్లాడాలని కోరారు. ఎవరితో కూడా తప్పుగా ప్రవర్తించకూడదని సూచించారు. తిరుపతి టెంపుల్ టౌన్‌లో కాలేజీలు, యూనివర్సిటీతోపాటు ఇతర విద్యాసంస్థలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మంచి ఫలితాలు తీసుకురావాలని స్పష్టం చేశారు. అదే సమయంలో పోలీసులు తమ జీవితాలను సమస్యలు బారి నుండి కాపాడుకుంటూ ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సోమవారం ట్రాఫిక్ డీఎస్పీతో కలిసి నగరంలోని లీలా మహల్ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్, గరుడ సర్కిల్, ప్రైవేట్ బస్సుల పార్కింగ్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. నగరంలో ప్రస్తుతం అమలవుతున్న ట్రాఫిక్ విధానాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. వీటికి కొన్ని సవరణలు చేసి సరికొత్త ప్రణాళికతో ట్రాఫిక్ ఇక్కట్లను తొలగించనున్నట్లు వివరించారు.

ఐక్యంగా పోరాడుదాం..



చంద్రగిరి మండలం అగరాల గ్రామంలో టీడీపీ నేతల కారణంగా నష్టపోయిన బాధితులను ఓదారుస్తున్న చెవిరెడ్డి



పాకాల మండలంలోని పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

దాడులను ఎదుర్కొందాం

- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : ఐక్యంగా పోరాడుదాం... దాడులను ఎదుర్కొందాం అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పాకాల, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చెవిరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసినప్పటి నుంచి టీడీపీ కార్యకర్తలు అరాచకంగా వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలిచిన వారు హుందాగా ప్రవర్తించాలని, ప్రజలకు మంచి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అంతే కానీ, ప్రత్యర్థి పార్టీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజలే తన కుటుంబంగా ఇన్నేళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్నానని, అయినప్పటికీ తన బిడ్డను ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బాధలో ఉండగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. అయితే కష్టంలో వున్న కార్యకర్తలను కాపాడుకోవడానికి ఎంతకైనా తెగిస్తానని, ఎంత వరకైనా పోరాడుతానని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సైతం దిగుతానని స్పష్టం చేశారు. దాడికి ప్రతి దాడి చేయడం సంస్కారం కాదు కనుకనే శాంతి యుతంగా పోరాటం చేయాలనుకుంటున్నామన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలను అడ్డుకునేందుకు ఎవరిపై దాడి జరిగినా క్షణాల్లో వంద మందికి తక్కువ కాకుండా అక్కడకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అకారణంగా దాడులు చేస్తుంటే సహించేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. పోలీసులు ఇప్పటికైనా ఉదాసీన వైఖరిని విడిచిపెట్టి దాడులకు కారణమైన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయని వెల్లడించారు. నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకునేందుకు సిద్ధంగా ఉన్నానని, ఇకపై ఎక్కువ సమయం వారితోనే గడుపుతానని భరోసా ఇచ్చారు.

బాధితులకు చెవిరెడ్డి ఓదార్పు

చంద్రగిరి : చంద్రగిరి మండలం అగరాల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు దేవారెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డితో పాటు వారికి అండగా నిలబడిన మైనారిటీ వర్గానికి చెందిన యువకుల ఇళ్లపై టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. వీరి ఆగడాలను తట్టుకోలేక 10 మంది యువకులు ఊరు విడిచిపెట్టి పరారయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి హుటాహుటిన గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి పిల్లలను కాపాడుకునే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే చంద్రగిరికి చెందిన మరో ముస్లిం యువకుడిపై ఆదివారం రాత్రి దాడి చేయగా అతడికి చెవిరెడ్డి ధైర్యం చెప్పారు. ఈ క్రమంలోనే తిరుపతి రూరల్ మండలం సప్తగిరి కాలనీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఇంటిపై టీడీపీ కార్యకర్తలు రాళ్లు, కర్రలతో విరుచుకుపడ్డారు. ఆయన కారును ధ్వంసం చేశారు. టీడీపీ నేతల వరుస దాడులపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



టీడీపీ నాయకుల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ నేత కారును పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



ఎర్రావారిపాళెం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

క్లుప్తంగా

మెడికల్ కాలేజీపై చర్యలకు డిమాండ్



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రేణిగుంట: విద్యార్థులను వేధిస్తున్న బాలాజీ మెడికల్ కళాశాల యాజమాన్యంపై హెల్త్ యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి డిమాండ్ చేశారు. సోమవారం రేణిగుంట విమానాశ్రయ మార్గంలోని బాలాజీ మెడికల్ కళాశాల గేటు వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బాలాజీ మెడికల్ కళాశాలలో ఎంఎల్‌టీ, బీపీటీ చదువుతున్న విద్యార్థులు వేసవి సెలవులు అనంతరం వస్తే ఆలస్యంగా వచ్చారని, అటెండెన్స్ లేకపోతే పరీక్షలకు అనుమతించమని బెదిరించారని మండిపడ్డారు. రూ.5 వేలు నుంచి రూ.7,500 వరకు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. డబ్బులు కట్టకుంటే కాలేజీకి రావొద్దని విద్యార్థులను వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా ప్రశ్నించినా, వివాదం చేసినా ఇంటర్నల్ పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని విద్యార్థులను బెదిరిస్తున్నారన్నారు. మెడికల్ విద్యార్థుల నుంచి కూడా డొనేషన్ల పేరుతో నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు సాయి, ఉదయ్, ప్రవీణ్, హరి, ఓంరాజ్, వినయ్, తేజ, శంకర్, శివానీ, గ్రేస్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,744 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,833 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.34 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

అరణియార్ ఎదురుచేపలు

- ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన చేప పిల్లల విడుదల
- ఇప్పటికైనా జలాశయంలో వదిలిపెట్టాలంటున్న మత్స్యకారులు
- త్వరలోనే నిర్ణయం తీసుకుంటామంటున్న అధికారులు

అరణియార్ జలాశయంలో వేట సాగించి వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. సమృద్ధిగా లభించే మత్స్యసంపదను విక్రయించి పొట్ట పోసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం సైతం ఏటా లక్షలాది చేప పిల్లలను జలాశయంలో వదలడం ద్వారా మత్స్యకారులకు చేయూతనందిస్తోంది. ఈ ఏడాది సైతం పిల్లలను వదిలేందుకు వైఎస్సార్‌సీపీ సర్కారు సర్వం సిద్ధం చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో మొత్తం ప్రక్రియ ఆగిపోయింది. దీంతో కేవలం చేపల వేటతోనే జీవనం సాగించే మత్స్యకార కుటుంబాలకు ఉపాధి పోయింది. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు బతుకులకు ఊరట కల్పించాల్సిన అవసరముంది. ఇప్పటికైనా డ్యామ్‌లో చేప పిల్లలను వదలాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఎంతైనా ఉంది.

పిచ్చాటూరు : అరణియార్ జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయాలని మత్స్యకారులు కోరుకుంటున్నారు. ప్రతి ఏటా 10 లక్షల చేప పిల్లలను ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌లో వదిలేది. అవి పెరిగి పెద్దదైతే వాటిని పట్టి అమ్ముకొని స్థానిక మత్స్యకారులు జీవించేవారు. అయితే ఈ ఏడాది మొదట్లోనే 10 లక్షల చేప పిల్లలు వదలడానికి అధికారులు సిద్ధం చేయగా ఎన్నికల కోడ్ అడ్డొచ్చి ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న తరుణంలో జలాశయంలో చేప పిల్లలు విడుదల చేసి తమను ఆదుకోవాలని మత్స్యకార కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి.

వరదలో కొట్టుకుపోయిన చేపపిల్లలు

అరణియార్ గేట్ల సమీపంలో మత్స్యకేంద్రం ఉంది. ఇందులో ఏటా సుమారు 20 లక్షలకు పైగా చేప పిల్లలు పెంచడం, వాటిని జలాశయంలో వదలడం జరుగుతోంది. అయితే గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పూర్తి స్థాయిలో గేట్లన్నీ పైకెత్తి భారీగా వరద నీటిని కిందికి విడుదల చేశారు. ఆ సమయంలో చేప పిల్లలు పెంచే తొట్లన్నీ మునిగిపోయి, అందులో ఉన్న సుమారు 20 లక్షలు చేప పిల్లలు వరదలో కొట్టుకుపోయాయి.



పిచ్చాటూరులో కళకళలాడుతున్న అరణియార్ జలాశయం



అరణియార్‌లో తెప్పపై చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు (ఫైల్)

2 వేల కుటుంబాలకు జీవనోపాధి

అరణియార్‌లో చేపలు పట్టుకుని పిచ్చాటూరుతో పాటు నింద్ర, కేవీబీ పురం మండలాల్లోని సుమారు 2 వేల మత్స్యకార కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఒక్కొక్కరు ఏడాదికి రూ.410 చెల్లించి లైసెన్సు తీసుకుని చేపల వేట సాగిస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో చేపల కొరత కారణంగా వీరందరూ పొట్టపోషణకు ఇబ్బంది పడుతున్నారు.

ఆదుకోవాలి



అరణియార్‌లో చేప పిల్లలు వదిలి మత్స్యకారులను ఆదుకోవాలి. ఈ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. ఎన్నికల కోడ్ అని చేపపిల్లల విడుదలను నిలిపివేశారు. ఇప్పుడైనా వదలాలని వేడుకుంటున్నాం.

– బాబు రెడ్డి, మత్స్యకారుడు, పిచ్చాటూరు

చేపల అమ్మకమే జీవనాధారం



చేపల అమ్మకమే మాకు జీవనాధారం. పిల్లలు వదలకపోవడం, జలాశయంలో ఉన్న చేపలు సైతం వరదలో కొట్టుకుపోవడంతో ఇప్పుడు మత్స్య సంపద తగ్గింది. దీంతో బతుకుదెరువు కష్టంగా మారింది. ప్రస్తుతం బయటి చెరువుల నుంచి చేపలు తెచ్చి అమ్ముకుంటున్నాం. దీంతో పెద్దగా లాభం లేదు.

– విజయన్, మత్స్యకారుడు, కీళపూడి, పిచ్చాటూరు మండలం

ఎన్నికల కోడ్‌తో ఆలస్యం



ఎన్నికల కోడ్ కారణంగా అరణియార్‌లో చేప పిల్లలు వదలడం ఆలస్యమైంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కలెక్టర్, ప్రజాప్రతినిధులతో చర్చించి చేపపిల్లలు వదలడానికి నిర్ణయం తీసుకుంటాం. మత్స్యకేంద్రంలోని పిల్లలు వరదకు కొట్టుకుపోవడం వల్ల కల్యాణి డ్యామ్ నుంచి చేప పిల్లలను తెప్పించాల్సి వచ్చింది. అన్ని రకాలు కలిపి సుమారు 10 లక్షల చేప పిల్లలను సిద్ధంగా ఉంచాం.

– నాగరాజు, ఏడీ, మత్స్యశాఖ, తిరుపతి



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.73,320
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,587
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.91,500
రిటైల్ వెండి గ్రాము	రూ.93.50

ఒకే చోట రెండు ప్రమాదాల్లో ఇద్దరి మృతి





ప్రమాదంలో మృతి చెందిన మంగయ్య, స్వప్న (ఫైల్)

తొట్టంబేడు : ఏర్పేడు– వెంకటగిరి రహదారిపై ఆదివారం రాత్రి ఒకే చోట జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం వాంపల్లె సమీపంలో కారు కల్వర్టుని ఢీకొనడంతో పల్లి మంగయ్య(55) అనే వ్యక్తి మరణించాడు. సూరావారిపల్లెకు చెందిన మంగయ్య, గుర్రం చెంచుబాబు కారులో వెంకటగిరి నుంచి స్వగ్రామం వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలోనే వెంకటగిరి నుంచి తిరుపతికి కారులో వస్తున్న వెంకటకిరణ్‌కుమార్, స్వప్న(45) అక్కడ ఆగారు. కారు దిగి ప్రమాదానికి గురైన వారిని పరిశీలిస్తుండగా ఏర్పేడు ఎస్ఐ వాహనం ఢీకొంది. క్షతగాత్రులను వెంకటగిరి తరలించగా స్వప్న అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసినట్లు శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

సబ్ ఇంజినీర్ దుర్మరణం



యశ్వంత్(ఫైల్)

కలువాయి: కలువాయిలో విద్యుత్ శాఖలో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కె.యశ్వంత్(24) ఆదివారం బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం ఆయన బెంగుళూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో బైక్‌పై వెళుతుండగా లారీని ఢీకొంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు చెందినట్లు విద్యుత్ సిబ్బంది వెల్లడించారు. యశ్వంత్ మృతికి కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

ఎంపీ గురుమూర్తికి ఘన సత్కారం

తిరుపతి కల్చరల్ : తిరుపతి ఎంపీ గురుమూర్తిని శ్రీచల్లప్ప మేస్త్రీ మెమోరియల్ అంబేడ్కర్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కమిటీ చైర్మన్ పి.పరమశివన్ మాట్లాడుతూ దళితుల సమస్యలపై స్పందించే మంచి మనిషి మన ఎంపీ గురుమూర్తి అని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించే నాయకుడన్నారు. అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. విశేష ప్రజాదరణతో విజయం సాధించిన నేపథ్యంలో ఎంపీ నివాసంలో ఆయనను కలిసి అభినందించారు. ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్ నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి కె.మురళి, సభ్యులు ఇంద్రముని, సబ్ కమిటీ సభ్యుడు రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న అంబేడ్కర్ భవన్ కమిటీ

జూలై 20 నుంచి నాటక, నృత్య పోటీలు

తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో మహతి కళాక్షేత్రంలో అభినయ ఆర్ట్స్ 24వ జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలను జూలై 20 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ జాతీయ పోటీలకు 32 పద్య నాటకాలు, 57 సాంఘిక నాటికలకు దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అత్యుత్తమమైన 9 పద్య నాటకాలు, 12 సాంఘిక నాటికలను ఎంపిక చేసినట్లు వివరించారు. ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి హనుమ అవార్డ్స్‌తో పాటు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. అలాగే పోటీల్లో ప్రదర్శించిన ప్రతి నాటిక, నాటకానికి పారితోషికం అందిస్తామని తెలిపారు. వీటితో పాటు కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద నృత్యాలు, సోలో పోటీలు సీనియర్స్, జూనియర్స్ రెండు విభాగాలుగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, ప్రతినిధులు ఎస్.విశ్వనాథరెడ్డి, కోటేశ్వరరావు, విజయకుమార్, కె.భాస్కర్‌రెడ్డి శోభ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్ రెడ్డి

గుర్తు తెలియని మృతదేహం



చంద్రగిరి : జాతీయ రహదారి సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంకు ప్రహరీ గోడ వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని (55) స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెళ్లకూరు : మండలంలోని దిరసనమాల గ్రామానికి చెందిన అల్లాకుల ఆనందయ్య(55) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. ఆనందయ్య కొంత కాలంగా విద్యుత్ లైన్‌మన్‌కు సహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో పాలచ్చూరు అరుంధతి కాలనీలో గృహ విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించేందుకు ఎల్‌సీ తీసుకొని పని చేసుకుంటున్నాడు. ఇంతలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రత్నమ్మ, కుమారుడు శ్రీచక్ర కుమార్ ఉన్నారు.

విగ్రహాల ధ్వంసం

కుప్పంరూరల్: కుప్పం మండలం, వసనాడుగొల్లపల్లె సమీపంలో వెలిసిన శ్రీ నాగులమ్మ దేవాలయంలో నాగులమ్మ విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారు. విగ్రహాలను పదునైన ఆయుధాలతో తొలగించారు. విగ్రహాల కింద తవ్వకాలు చేపట్టడంతో, గుప్త నిధుల కోసమేనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతున్నారు. విగ్రహాల ధ్వంసం వెనుక స్థానికుల హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా విచారణ చేస్తున్నామని, త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని పోలీసులు వెల్లడిస్తున్నారు.

మందుబాబుల వీరంగం!

తిరుపతి లీలామహల్ కూడలి వద్ద బైక్‌పై ముగ్గురు వెళుతుండగా ట్రాఫిక్ పోలీసులు ఆపారు. త్రిబుల్స్ వెళ్లకూడదని తెలియదా? అని పోలీసులు ప్రశ్నించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆ ముగ్గురు 'మీరెవ్వరా మమ్మల్ని ఆపేందుకు' అంటూ దూషించారు. ఇంతలో ట్రాఫిక్ ఎస్ఐ అక్కడికి చేరుకుని బైక్‌ని వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లమని ఆదేశించారు. దీంతో రెచ్చిపోయిన మందుబాబులు ''ఎంత ఫైన్ వేసుకుంటావో వేసుకో, బైక్ తీసుకెళతావా తీసుకుపో.. నేను స్టేషన్‌కు రాను. అసలు మా బైక్ నిలిపే రైట్ మీకుందా.. బ్లడీ ఫూల్'' అంటూ మందుబాబులు రెచ్చిపోయారు. ఎట్టకేలకు బైక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మందుబాబులను కూడా ఆటోలో స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇంతకూ మందుబాబుల సెల్‌ఫోన్లపై జనసేన స్టిక్కర్లు ఉండడం గమనార్హం.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ట్రాఫిక్ పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తున్న మందుబాబు



ఎస్ఐ, ట్రాఫిక్ కానిస్టేబుల్‌పైకి దూసుకెళుతున్న మందుబాబులు



ట్రాఫిక్ కానిస్టేబుల్ నుంచి బైక్ తాళాలను లాక్కునేందుకు యత్నం



బైక్‌ను స్టేషన్‌కు తీసుకెళుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



మందుబాబుల సెల్‌ఫోన్‌పై జనసేన స్టిక్కర్లు



మందుబాబులను ఆటోలో స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

విద్యార్థులకు బస్సు పాస్‌లు సిద్ధం

- రేపటి నుంచి పంపిణీకి సన్నాహాలు
- రెన్యూవల్ చేసేందుకు కసరత్తు
- ప్రభుత్వ పాలసీ ప్రకారం నూతన దరఖాస్తులు
- గత ఏడాది 42,546 మందికి పాస్‌లు

తిరుపతి అర్బన్ : బడికి వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ శుభవార్త చెబుతోంది. ప్రతి ఏడాది మాదిరిగానే బస్సు పాసుల రెన్యూవల్‌కు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. బుధవారం నుంచి పాస్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సుల ద్వారా ఇంటి నుంచి విద్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈమేరకు విద్యార్థులకు ప్రజా రవాణాశాఖ ఏటా ఉచిత, రాయితీ బస్సు పాసులను మంజూరు చేస్తోంది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు ఈనెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఈనెల 1వ తేదీ నుంచి కళాశాలలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో అంతా ఉచిత బస్సు పాస్‌ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. తిరుపతి డిపోకు సంబంధించి గత ఏడాది 6,999 బస్సు పాస్‌లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా వీటి సంఖ్య 42,546గా నమోదైంది.

చదువుకు తోడ్పాటు

జిల్లాలోని శ్రీకాళహస్తి, వెంకటగిరి, చంద్రగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట ,గూడూరు,తిరుపతి, వాకాడు, గూడూరు, మంగళం తదితర డిపోల నుంచి విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత, రాయితీ బస్సు పాసులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువుకు తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పంపిణీకి చర్యలు

ఆర్టీసీ బస్సు పాస్‌లను రెన్యూవల్ చేయనున్నారు. కొత్త పాసుల జారీ ప్రక్రియను ప్రభుత్వ పాలసీ ప్రకారం విడుదల చేసే అవకాశం ఉంది. రెండు నెలల సెలవుల తర్వాత విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా రవాణాశాఖ బస్సు పాసుల రెన్యూవల్ కౌంటర్లను ప్రారంభించింది. పాస్‌ల పంపిణీకి చర్యలు చేపట్టింది.

ఎవరెవరికి ఇస్తారంటే..

అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్లలోపు బాలికలకు ఉచితంగా బస్సు పాసులను జారీ చేస్తున్నారు. పాస్ ఏడాది వరకు చెల్లుబాటు అవుతుంది. ఈ పాసుల ద్వారా విద్యార్థులు తమ నివాసం నుంచి 20 కిలోమీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందుకుగాను విద్యార్థి ఫొటో, స్కూలు యాజమాన్యం నుంచి సర్టిఫికెట్, ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. మిగిలిన వారికి రాయితీపై పాసులను మంజూరు చేస్తారు. పాసు ధరతో పాటు సంవత్సరం గుర్తింపుకార్డు కోసం రూ.100. నెలవారీ గుర్తింపు కార్డు కోసం రూ.50, సర్వీసు చార్జీ రూ. 40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ బస్సు పాసులు నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితిపై జారీ చేస్తారు. గడువు ముగిశాక రెన్యూవల్ కోసం ప్రిన్సిపల్ సంతకం చేయించుకుని తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి ఏప్రిల్ వరకు, ఐటీఐ, పారా మెడికల్ చదివే వారికి మే నెలలో కూడా పాసులను మంజూరు చేస్తారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీ ఇస్తారు. మరోవైపు ఆర్టీసీ దివ్యాంగులకు ఉచిత పాసులను అందజేస్తోంది. వీరు సదరన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, అన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మూడేళ్ల కాల వ్యవధితో పాసులను జారీ చేస్తారు.



తిరుపతి డిపోలో బస్సు పాస్ మంజూరు కేంద్రం

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బస్సు పాస్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. పాఠశాలల ప్రారంభం నాటికి ఇబ్బందులు లేకుండా పాస్‌లను ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నాం. విద్యార్థుల పాస్‌లతోపాటు ఇతర పాస్‌లను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. రాయితీ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి డిపో

పిల్లలకు రాయితీ

ప్రతి విద్యార్థి రాయితీ బస్సు పాసు పొందవచ్చు. చార్జీలో ఒక వంతు మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఇందుకోసం కళాశాల జారీ చేసిన సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థి ఫొటో జత చేసి పాస్ పొందవచ్చు. నెలవారీ ఐడీ కార్డులకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.